వ్రాత బల్లవద్ద

కొడవటిగంటి కుటుంబరావు

బోలెడంత రాతపని పేరుకుని ఉంది ఇక బద్ధకించి లాభంలేదు. ఆ పత్రిక వాళ్లను మొహమాటపెట్టి ఏనాడనంగా డబ్బు తీసు కొన్నాను? నాలుగు నెల్లు—నాలుగేం ఖర్మం? అయిదు నెల్లయింది. ఒక ఉత్తమ కథానికగాని, అమూల్యమైన వ్యాసరాజముగాని పంపమని వాళ్లు ప్రతినెలా రాస్తూనే ఉన్నారు. నేనూ రాద్దామనుకుంటూనే ఉన్నా, కాని పట్టంలేదు. నాకున్న చిక్కులు వాళ్లకేం తెలుస్తయ్? చెప్పకుంటే మటుకు వినేవాడెవడు? మూడే మూడు పంక్తులు కార్డు ముక్క రాద్దామంటే మూడు రోజులు ంచీ పడకుండా ఉంది....అన్నట్టివాళ్ల శుక్రవారం కాదూ? ఇవాళ ఉత్తరం రాయక పోతే సోంవారం ముందు వాడికి అందదు. సోంవారమూ అందదు పోస్టు చేరేవేళకి వాడాఫీసుకు పోతాడు రాత్రికిగాని రాడు. వాడు మంగళవారం రాస్తే నాకు బుధవారం చేరుతుంది. అంటే నేను బుధవారం రాత్రి దాకా వాడి సమాధానం చూడనన్నమాట. ఛత్....ఇవాళ ఆ కార్డు ముక్క రాయక పోయానో, వ్యవహారం ఇంకోవారం దేకిందన్న మాటే. నూరు ఆరయేది, ఆరు నూరయేది ఇవాళ కార్డు రాయాలసిందే పత్రిక సంగతి తరువాత చూద్దాం...

కొంపతీసి కార్డులన్నీ అయిపోయాయా ఏం? ఇంకా రెండుండాలే. మూడణాలుపెట్టి నాలుగు పట్టుకొచ్చి అందులో ఒకటి ఆ నాడే రాశేశా. ఆ తరవాత ఇంకోటిగామాలు రాశా. అంతేగా?... అన్నట్టు ఆవిడ వాళ్ల అన్నకొకటి రాసినట్టుంది. అట్లా అయినా ఇంకోటుండాలే. అది కూడా తీసుకుని వాళ్ల అక్కకి రాసేసిందేమో; కొంప తీసి. కార్డు కనిపిస్తేచాలు, అర్జంటుగా ఉత్తరం రాయాలిసొస్తుంది. ఆ మాట అంటినా, నేను తన కార్డులు ఖర్చుచేసిన సంగతి తెచ్చి దెప్పతుంది. కిందటేడు వాళ్ల నాన్న వచ్చినప్పుడు 'నీదగ్గిర ఉంటుంది, సమయానికి లేకపోతుంది. ఈ కట్ట ఉంచుకో' అంటూ మెహర్బానీగా పదహారు కార్డుల బొత్తి ఇచ్చివెళ్ళాడు. ఆ ముష్టి కార్డుల్లో నేను అయిదో ఆరో వాడానుట. అవసరానికి దగ్గిర కార్డు లేకపోతే వాడుకున్నానుమరి. అదో నిష్టూరమూ? అంతలోనే వాళ్ల పుట్టింటి వాళ్లసొమ్మంతా నేను తినేసినట్టు మాట్లాడక్కర్లేదే.

ఉత్త కవర్లుండాలి కవరు రాద్దామన్నా స్టాంపులు లేవే. మొన్న పోస్టాఫీసుపక్క వెళ్లినప్పుడు, ఏమిట్రా పోస్టాఫీసులో కొందామనుకున్నానూ? అని ఎంత ఆలోచించినా జ్ఞాపకం వచ్చి చావలేదు – స్టాంపులు. ఈసారన్నా జ్ఞాపకం పెట్టుకొని నాలుగు అణా బిళ్లలూ, నాలుగు కార్డులూ కొనాలి. తప్పదు....ఒకపని చేస్తా మావాడికి ఉత్తరం రేపు రాసి ఎక్స్ప్రెస్ డెలివరీవేస్తా. వాణ్ణికూడా జవాబు అట్లాగే రాయమంటా. ఎందుకొచ్చిన బెడద.

ఎవరో అన్నారు-ఏ ఉత్తరానికైనా జవాబు రాయకుండా రెండు మూడు నెల్లూరుకుంటే తరవాత జవాబుతో నిమిత్తమే ఉండదని. ఏడిసినట్టే ఉంది. మనం రాయాలిసిన ఉత్తరాల మాటేమిటి? నేనీ ఉత్తరం రాయకపోతే వీలుందా? దానికి మావాడు మూడునెల్లు జవాబివ్వకపోతే? ఛత్. తోచీతోచనివాళ్లు ఏదో చచ్చు కబుర్లు చెప్పటమూ, మనం వాటిని వేదంముక్కలల్లే జ్ఞాపకం ఉంచుకుని వేళగాని వేళ మననం చేసుకోవటమూనూ....

ఈ పూటకి ఉత్తరం ముక్క రానుకువే యోగ్యత లేనేలేదు. ఆ పత్రిక కేదన్నా రాస్తే? నెలాఖరువారం. వెంటనే పంపితే వచ్చే సంచికకు అందొచ్చు. లేకపోతే ఇంకోనెల ఆలస్యం

చేసినట్టవుతుందితప్ప ఇంకేమీ ఉండదు. రాయటానికేదన్నా ఆలోచించైనా పెట్టుకున్నానుకాను.

రాయటానికి కూచుని ఆలోచిస్తే బుర్ర కాస్తా కడిగేసిన వలకల్లే అయి చక్కాపోతుంది ఎక్కడో ఉంటారు అదృష్టవంతులు - లేడికి లేచిందే పరుగల్లే, కలం పట్టుకోగానే వాళ్ళకు కావ్యం వస్తుంది. మనకా అదృష్టం లేదు. మనకు ఏదన్నా చదువుతున్నంతసేపూ బుర్ర జోరుగా పనిచేస్తుంది. ఎక్కడెక్కడి కథలూ తడతయ్. కాని అవి అప్పుడే పోతై....ఈసారి అటువంటి ఐడియాలు వచ్చినప్పుడు ఎందులో నన్నా రాసిపెట్టుకోవాలి ఈ సంగతి లోగడ ఎన్నోసార్లు అనుకున్నదే కాని తీరా సమయానికి జ్ఞాపకం ఉండదు....అన్నట్టు కొందరు విదేశీయులు తమ అనుభవాలూ, తాముఎక్కడెక్కడో చూసిన మనుషుల వర్ణనా, వాళ్ల స్వభావ చేష్టలూ రాసిపెట్టుకొని, తరువాత ఏ కథలోకో, నవలలోకో ఎక్కించేస్తారుట. వాళ్లకు అదే వృత్తిగనక ఎన్నయినా చేస్తారు. వాళ్ళు ఒక్క పుస్తకంమీద సంపాదించే మొత్తం మనం యావజ్జీవితంలో సంపాదించలేం. వాళ్లు మహారాజులు. సొంత ఖర్చుతో ప్రపంచమంతా చుట్టి వస్తారు, అతి విచిత్రమైన అనుభవాలు సంపాదిస్తారు. ఒక కథకుడు బొగ్గు గనుల్లో పనిచేసే వాళ్ళ జీవితం చిత్రిస్తూ నవల రాయటానికని, తానే ఒక బొగ్గు పనివాడి ఉద్యోగం సంపాదించి ఆరునెల్లు పనిచేశాట్ట అటువంటివాడు రాయలేక ఏంజేస్తాడూ?

మన సంగతి చూడబోతే ఇల్లూ, సంసారం, పిల్లలూ, కీచులాటా, అరుపులూ, అల్లరీ, ఆఫీసూ, వెట్టిచాకిరీ, గదమాయింపులూ, నీరసం, నిస్పృహా, విరక్తీ, విసుకూ-వీటిమధ్య ఏం రాసేట్టు, ఏం చెండేట్టు? చూసిన మొహాలే చూడటం, విన్నమాటలే వినటం, అన్నమాటలే అనటం. అంతా కలిసి గంజిగుంట ప్రమాణపు జీవితం ఇందులో ఎరవేసి చేపలు పట్టాలి.

ఏమిటో అనుకుంటాంగాని, కూచున్న చోటి నుంచి కదలకుండా గొప్ప పుస్తకాలు రాసిన వాళ్ళు లేరూ? ప్రపంచమంతా చుట్టివచ్చిన వాళ్ళు రాసిన పుస్తకాలు బాగుండి అహెూరించాయా ఏమిటి? అట్లా రాసిన పుస్తకాల్లో కూడా వాస్తవికత ఉండదు. ఎంతో డబ్బు తగలేసి, మారుమూల దేశాలన్నీ తిరిగి కూడా వాళ్ళు ఆ దేశాల్లో తాము చూడదలిచిందే చూస్తారుగాని, కళ్ళఎదట ఉన్నది చూడరు. ఆ భాగ్యానికి వాళ్లు ఇంత దూరం పోవటం దేనికి? ఇంత శ్రమ దేనికి? అంతా భేషజం. పబ్లిసిటీ.

ఆమాటకొస్తే పబ్లిసిటీలోమాత్రం ఏముంది? అదృష్టం ఉంటే రాతగాడు ఇట్టే పైకొస్తాడు. కొందరు ఏళ్ళతరబడి రాసినా అడుగునే ఉండిపోతారు. న్యాయంగా మనం రాసింది ఎంత? .. అందుకే ఉట్టుడియంగా పైకి వచ్చేశానని కుళ్లే వాళ్లు కొందరున్నారు. పేరుచూసే ఇంత కుళ్లుతారే, గాతగాడికి డబ్బుకూడా వస్తే ఇంకెంత కుళ్లుతారో....

అరె, చూస్తుండగానే పుణ్యకాలం వెళ్ళిపోతున్నదే. ఇక ఆరంభించాలి. తాత్సారంచేసి లాభంలేదు....అన్నట్టు సీరాబుడ్డీ ఖాళీ అయినట్టుంది. కలంలో ఏపాటి సీరా ఉందో మధ్యలో సీరా అయిపోతే ఎంత శోభగా నన్నా ఉంటుంది. దీం దుంపతెగ. ఒక్క వ్యాసం రాయాలంటే ఇంత కృత్యాద్యవస్థా? ఇన్ని విఘ్నాలా? ఇంకా పెద్దపనులు చెయ్యాలంటే ఎట్లా?

కాకపోయినా మిగిలినవన్నీ ఒక ఎత్తూ, రాయటం ఒక ఎత్తూనూ అందుకేగా కవి అన్నాడూ.. నిరుపహతిసలంబుతి రమణీ ప్రియ దూతిక తెచ్చి ఇచ్చు కప్పర విడెము....అది అనాదివాళ్ల గొంతెమ్మ కోరిక ఈ నాడు రాతకు కావలిసింది అడపా దడపా ఒక అర కప్పు కాఫీ, ఒక ఖరీదైన సిగిరెట్టు పాకెట్టూ, మంచి కాగితాలూ, దర్జా అయిన కలం, మంచి బల్లా. సినిమాలకు రాసేవాళ్లది అదృష్టమంటే-వాళ్ల కన్నీవస్తయ్; డబ్బుకూడానూ సినిమా కవి అయినా బాగుణ్ణు. దూత్....

ఈ బల్ల—ఇరవై రూపాయలు పోసి కొన్నా నేలకు నాలుగు కోళ్ళూ ఆనవు ముందు పక్క కుడిచేతివేపు కోడు గాలిలో ఉంటుంది. రాయటానికి బల్లమీదికి వంగితే వెనకవేపు ఎడంచేతి

వేపు కోడు గాలిలోకి లేస్తుంది. పరధ్యానంలో చేతులు తీసేసరికి దఢాల్న వెనక్కు పడిపోతుంది బల్ల. ఇరవై రూపాయలు పోసి కొన్న బల్లను చూస్తూ చూస్తూ శంకించలేక, లోపం నేలలోనే ఉన్నదనుకుని బల్లను గది అంతటా పెట్టి చూశా. ఎక్కడ పెట్టినా ఒక కాలు గాలిలోనే ఉంది ఇక తప్పు బల్లదేనని ఒప్పుకోక తప్పిందికాదు మిగిలిన మూడు కోళ్ళూ కోయిస్తేగాని బల్ల కుదురుగా నుంచునేట్టులేదు. అది మాత్రం మాటలా? కోసేవాడు దొరకాలి వాడు నన్ను దివాలా తీయించటానికి చూడకుండా ఉండాలి సమయానికి నా దగ్గిర డబ్బులుండాలి అందుచేత, తాత్కాలిక ఏర్పాటు కింద ఏవో కాగితాలు మడిచి కుంటికాలికింద ఎత్తుపెట్టా. ఎప్పుడు మాయమయిందో ఆ కాగితం కాస్తా మాయమయింది. నేను బల్లముందు కూచుని దానిమీద మోచెయ్యి ఆనించేటప్పటికి అది కాస్తా ముందుకు ఒరిగింది. గత్యంతరంలేక కుంటికాలికింద మళ్ళా కాగితాల మడతపెట్టా. మళ్ళీ మర్నాటికది మాయమైంది పంచాయతీ చెయ్యగా ఆ కాగితం మడతలను పనిమనిషి గది ఊడ్చేటప్పుడు తీసి పారేస్తున్నట్టు తేలింది. ఆ కాగితం మడతలను ముట్టుకుంటే ఎంతమాత్రం మర్యాదగా ఉండదని పనిమనిషికి గట్టిగా చెప్పా రెండు రోజులు ఊరుకుని మళ్ళీ తీసేసింది. నేను చాలా పెద్ద యుద్ధానికే తయారయినా. కాని ఆ రోజు ఇల్లు కడిగారుట. కాగితం తడిసిందిట. తడి కాగితం తీసెయ్యకుండా ఎట్లా? బల్ల కాస్తా చీకి పాడైపోదూ

బల్ల కాళ్లు కొయ్యక తప్పదనిపించింది. ఎవడో నాకు తగ్గ వడ్రంగే దొరికాడు. ముప్పావలా ఇమ్మన్నాడు. కోడుకు పావలా అని వాడి లెక్క కామాలు నేను పావలా ఇస్తానన్నా. కోసేవి మంచి కోళ్ళే అయినా, ఇచ్చే డబ్బులు చెడిన కోడుకే ఇయ్యాలని నా ఉద్దేశం. తన వల్లకాదని వెళ్ళిపోయాడు. ఇంకో బేడా ఇస్తానంటే వాడు ఒప్పుకునేవాడే అన్నారు మా వాళ్ళు. కాని నాకు టోపీ పడటమంటే చెడ్డమంట. నా పంతం నెగ్గించుకున్నా. ఇంకోడు వచ్చి ఆ పావలా డబ్బులకే కోసివెళ్ళాడు. ఆ నాటి నుంచీ ఆ బల్లకు రెండు కాళ్ళు పొట్టి. త్రాసు దండంలాగా ఈ వక్కకూ ఆ వక్కకూ ఆడుతుంది....ఏంచేసేదీ? దానితోనే కాలక్షేపం చేస్తున్నా....

ఈ సిగిరెట్లన్నీ ఇప్పుడు కాల్చినవేనా? ఇంతలోనే ఆరు సిగిరెట్లు కాల్చానా? ఎదురుగా తెల్లకాగితం ఎక్కిరిస్తున్నట్టుగా ఉంది. ఇంకేం రాస్తానివాళ'? పెట్టెలో రెండుసిగిరెట్లే ఉన్నయ్. తెప్పిద్దామన్నా పనిమనిషి వెళ్ళిపోయినట్లుంది కాస్త కాఫీఅయినా ఉంటే బాగుణ్ణు. కాఫీ సిగిరెట్టూ లేకుండా రాయాలంటే చాలాకష్టం దీన్నిబట్టి రాస్తున్నది మనమేఅయినా, మన చేత రాయిస్తున్నది కాఫీ సిగరెట్లనుకోవాలి ఒక రచయిత రచనలో హాస్యం గురించి చెబుతూ ఇంకో రచయిత....ఆయన హాస్యం ఆల్కహాల్ ప్రేరేపించేది, అన్నాడు ..సిగిరెట్టు తగలేసిరి, కాస్త కాఫీ ఇస్తుందేమో అడిగి చూద్దునా? పొడిలేదంటుందేమో. కొంపలో ఎప్పుడూ ఏదీ ఉండదు. అత్యవసరంగా కావలసినప్పుడే అసలుండదు మంచి మూడ్‌లోకి వచ్చి రాద్దామని కూచునేసరికి సిగిరెట్లో, అగ్గిపెట్టో ఖాళీ అయిపోతుంది లేకపోతే కలంలో సిరా అయిపోతుంది. లేకపోతే రాసుకునే కాగితాలు అయిపోతయ్.

ఇంట్లోకూడా ఇదేవరస. ఇడ్లీ తిందామనుకున్న రోజున పచ్చడి చెయ్యటానికి శనగపిండి వుండదు. శనగపిండి పచ్చడి లేకుండా ఇడ్లీ తినటమేమిటి? ఉప్మా తిందామనిపించిన నాడు కరేపాకుండదు. ఏ సినిమాకో వెళదామనుకున్న రోజున డబ్బులుండవు

అసలు యిదే ఒక మంచి కథఅవుతుంది. 'కలిగి ఖర్మం, లేక దరిద్రం' అనే పేరు ఆకర్షవంతంగా ఉంటుంది. నువు కథలకి పేర్లు బాగాపెడతావోయ్....అని ఒక మిత్రుడు అభినందించాడు. నీ కథలో సాగసంతా పేరులోనే ఉంది, అని మెచ్చుకునే దోరణిలో ఆక్షేపించిన వాళ్లుకూడా ఉన్నారు. కష్టపడి కథరాస్తూ మంచిపేరు పెట్టుకోరూ? సీతాఫలం పండు....

మాగాయి టెంక.... అరబ్బీ గుర్రం.... అని కథలకు పేర్లు పెట్టుకోవటం దేనికి?

అయినా ఒకళ్ళగొడవ నా కెందుకు? 'కలిగి ఖర్మం, లేక దరిద్రం....' అన్న పేరు బాగానే ఉండిఉంటుంది కథ వాస్తవికంగా కూడా వచ్చు. ఇప్పుడందరూ వాస్తవికతే కావాలంటున్నారు కూడా.... కాని ఒక్కటితెలిస్తే బాగుణ్ణు మా ఇంట్లో ఎప్పుడూ అవసరానికి ఏ వస్తువూ ఎందు కుండదో. మతిమరుపా, అశ్రద్ధా, ముందాలోచన లేకపోవడమా, బతకటం చేత కాకపోవటమా, జాతక ప్రభావమా, ఏమిటి? అదేదో తేలితేగాని కథ కుదరదు మరి మా కొంపలో ఈ అన్ని కారణాలూ కనిపిస్తయ్. కథలో అట్లా కుదరదు. పాత్రల అనుభవాలకు వాళ్ళ చిత్తవృత్తులే కారణంగా ఉండాలి....

ఒకపనిచేస్తాం. ఒక బీద కుటుంబాన్ని తీసుకుందాం. అందరికీ ఏవో కోరిక లుంటాయి గద. అవి తీరటానికి దారిద్ర్యం అడ్డొస్తుంది. అయిదారు ఉదాహరణలు తీసుకోవచ్చు. ఇంతలో రోజులు మారతై. నాలుగు డబ్బులు కళ్ళబడతై. కాని వాళ్లు తమ కోరికలు తీర్చుకోరు డబ్బు వెనకేస్తారు. అదివరకల్లా అవేవీ లేకుండా గడుపుకున్నాం కాదూ? మరికొంత కాలం ఆ స్థితిలో ఉన్నామనుకుంటే కొంత ధనం చేర్చవచ్చు, అనుకుంటారు ఒక్కొక్క వందే పోగుచేసి రెండువేలు మూడువేలో పోగుచేస్తా రనుకుందాం. ఇందుకుగాను వాళ్లు వెనకటికన్నా మరింత దరిద్రంగా జీవిస్తారు. ఈ డబ్బంతా ఎవరికో పెద్దవడ్డీమీద అప్పిచ్చేస్తారు. వాళ్లు కాస్తా దివాలాఎత్తుతారు. ఈ లోపల వీళ్ల రాబడికూడా పోతుంది. కథ బాగానే ఉండేటట్టుంది. తాపీగా రానుకుపోవాలి ఏదీ? టైమెంతా? అరె, ఆఫీసుకు టైమయిందే. ఇంకేం? సిగిరెట్టు పెట్టెకూడా ఖాళీ కానేఅయింది ఇంక రాసేదేమిటి?..ఇదుగో, నిన్నే వడ్డించూ, ఆఫీసు వేళ అయిందీ. ★

[ఆలిండియా రేడియో ప్రసారితం]

(41-వ పేజీ తరువాయి)

దూరాన్న పూళ్ళోని రికార్డుసంగీతం సన్నగా వినిపిస్తోంది. నైట్‌రౌండ్స్ వేసుకుని నూవర్ మెల్లిగా నడిచి వెళ్ళిపోతోంది. రాజగోపాలం భావనగర్ మెడికల్ వార్డులో అడుగుపెట్టగానే ఓ ఆడమనిషి సన్నగా ఏడుస్తున్న గొంతుక వినిపించింది. అక్కడి సిస్టర్ ఆ వ్యక్తిని కేక లేస్తోంది- 'చూడమ్మా- ఇది వార్డు. యిక్కడ ఏడ్వకూడదు' అని. కాని ఎన్నో సంవత్సరాల బాంధవ్యాన్ని వదలి వెళ్ళిపోయిన మనిషి కోసం వచ్చే దుఃఖాన్ని ఎలా ఆపుకోగలదు. కాస్సేపు ఏడ్వటం మానేసి, మళ్లా ఉండుండి ఏడుస్తోంది. రాజగోపాలాన్ని చూడగానే సిస్టర్ విష్‌చేసి 'డాక్టర్! హార్ట్‌ఫెయిల్‌కేసు నైట్ రౌండ్సులో డ్యూటీ అసిస్టెంటు చూశారు· అప్పటికే ఫల్స్ వీక్‌గా వుంది. గ్లూకోజు; కోరమీన్ యిచ్చారుగాని లాభం లేకపోయింది' అన్నది. రాజగోపాలం స్టెతస్కోపు పట్టుకుని మంచం దగ్గరికివెళ్ళి గుండె పరీక్షించి చూశాడు. ఎక్కడా చలనంలేదు. చేతులు కడుక్కుని వచ్చి 'డెత్ మిమో' మీద సంతకంపెడ్తూ 'సిస్టర్!ఆ అమ్మాయి ఏమవుతుందట' అన్నాడు. చనిపోయిన రోగిదగ్గర కూచుని ఇరవైసంవత్సరాల అమ్మాయి సన్నగా ఏడుస్తోంది. ఆ దృశ్యం చూడగానే రాజగోపాలం కొద్దిగా ఫీలయ్యాడు.

'కూతురట డాక్టర్. అతనుతప్ప ఆవిడకెవరూ దిక్కులేరట. పాపం ఎలాగడుస్తుందో-' అన్నది సిస్టరు. రాజగోపాలం మనస్సు బాధపడినా అతను ఇలాంటి దుఃఖమయ గాథల గురించి సానుభూతి ప్రకటించే స్థితిలో లేడు. రాత్రి దాటింది. కలెక్టరాఫీసులో మూడుగంటలు కొడ్తున్నారు. రాజగోపాలానికి నిద్రముంచుకు వచ్చేస్తుంది. స్టెత్ పట్టుకునిలేచి 'సిస్టర్, జీవితమనేది చాల గమ్మత్తయింది. అందరికీ ఒకే రకమైన జీవితం సాధ్యంకాదు. కారణమేమిటంటారా-' అని రెండడుగులువేసి- 'నాకూ తెలీదు సిస్టర్!' అంటూ పెద్దఅంగలు వేసుకుంటూ తన డ్యూటీ రూంకేసి నడవసాగాడు. రాజగోపాలం వెళ్తున్నవైపు సిస్టర్ నోరు తెరచుకుని చూస్తూ నిలబడి పోయింది. ★

Source: Press Academy Website, Telugu Swatantra Patrika, Feb 1957

Disclaimer: This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan
http://www.maganti.org/